

ఎన్నికల బిల్లులకు ఎదురుచూపు

జిల్లాలో ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల ఖర్చు బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు. ఒక్కో కేంద్రానికి రూ.5వేల నుంచి రూ.7వేల వరకు ఖర్చయింది. 8లో▸



ముగిసిన సాఫ్ట్‌బాల్ పోటీలు

నిర్మల్‌లో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్–17 బాలబాలికల సాఫ్ట్ బాల్ పోటీలు శనివారం ముగిసాయి. ఆదిలాబాద్ బాలుర జట్టు విజేతగా నిలిచింది. 10లో▸

గరిష్టం/కనిష్టం

29.0 /14.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వాయువ్యం దిశగా చలిగాలులు వీస్తాయి. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కులమతాలకు అతీతంగా పండుగలు

- జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్
- క్రిస్మస్ కానుకలు అందజేత



క్రిస్మస్ కానుకలు అందిస్తున్న కలెక్టర్ సంతోష్

మంచిర్యాలటౌన్: ప్రజలు ఏ పండుగనైనా కులమతాలకు అతీతంగా సంతోషంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మైనారిటీ ఫంక్షన్ హాలులో శనివారం క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని క్రిస్టియన్లకు క్రిస్మస్ కానుకలు, విందు ఏర్పాటు చేశారు. పలు చర్చిల పాస్టర్లు కేక్ కట్ చేసి కలెక్టర్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి రాజేశ్వరికి కేక్ తినిపించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు క్రైస్తవులకు క్రిస్మస్ కానుకలను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ నియోజకవర్గానికి వెయ్యి మందికి చొప్పున జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో 3 వేల మందికి కానుకలు అందజేస్తామని తెలిపారు. ప్రతీ నియోజకవర్గానికి రూ.2 లక్షల చొప్పున విందు కోసం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల తహసీల్దార్ ప్రసాద్, క్రైస్తవ ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు చిట్ల సత్యనారాయణ, పూదరి తిరుపతి, పెంట రజిత, గజ్జెల హేమలత పాల్గొన్నారు.

చదువు, క్రీడలతో మంచి భవిష్యత్



విజేతలతో కలెక్టర్ సంతోష్

మంచిర్యాలఅర్బన్: విద్యార్థులకు చదువు, క్రీడలతో మంచి భవిష్యత్ ఉంటుందని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయ మూడో వార్షిక క్రీడా దినోత్సవం(స్పోర్ట్ డే)కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి దోహదం చేస్తాయని అన్నారు. కబడ్డీ ఫైనల్ పోటీలను తిలకించిన కలెక్టర్ పాఠశాల, కళాశాలలో చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. వారం రోజులుగా నిర్వహించిన ఖోఖో, కబడ్డీ, పరుగు పందెం, బుక్ బ్యాలెన్సింగ్, లెమన్ స్పూన్ తదితర పోటీల్లో విజేతలకు గోల్డ్‌మెడల్, సిల్వర్, బ్రౌన్, ప్రశంసపత్రాలను కలెక్టర్ దంపతులు సంతోష్, పల్లవి అందజేశారు. అంతకుముందు విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జే.ప్రసాద్, ఉపాధ్యాయులు భాస్కర్, క్రిష్ణారావు, సవిత, సవిత, పూనం శుక్లా పాల్గొన్నారు.

సత్వర న్యాయం కోసం వినియోగదారుల ఫోరం

- జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోతిలాల్

మంచిర్యాలఅగ్రికల్చర్: కొనుగోలు చేసిన ప్రతీ వస్తువు విషయంలో మోసపోయిన, నష్టపోయిన వినియోగదారులు సత్వర న్యాయం కోసం వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన జాతీయ వినియోగదారుల దినోత్సవం కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి బి.శేషాద్రి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్, వినియోగదారుల హక్కుల సంస్థ అధ్యక్షుడు ప్రకాష్ కుంట, ప్రధాన కార్యదర్శి తౌటం చేతన సోనీ, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ గోపాల్‌తో కలిసి పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వినియోగదారుల హక్కులు కాపాడే విధంగా 2020లో సీసీపీఏ(సెంట్రల్ కన్జ్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ) స్థాపించారని, దీని ద్వారా ఫిర్యాదు చేసిన 30 రోజుల్లోగా కోర్టుకు నివేదిక సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. సమాజంలో ప్రతీ సమాచారం పొందే హక్కు, ఎంపిక చేసుకునే హక్కు, విన్నవించుకునే హక్కు, ఆరోగ్యకరమైన హక్కు, నష్టపరిహారం పొందే హక్కులు కల్పించినట్లు తెలిపారు. తూనికలు, కొలతలు, ఎంఆర్‌పీ, నాణ్యమైన సరుకులు, వంటగ్యాస్, రేషన్, ఇంధనం, విద్య, వైద్య సేవలు వంటి అన్ని సేవలను పొందే హక్కు ప్రతీ వినియోగదారుడికి ఉందన్నారు. 2019వినియోగదారుల హక్కుల పరిరక్షణ నూతన చట్టం వినియోగదారులకు ఆయుధంగా నిలిచిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

‘ముక్కోటి’ దర్శనం



మంచిర్యాలరూరల్(హాజీపూర్): గుడిపేట గోవిందక్షేత్రంలో దర్శనానికి బారులు తీరిన భక్తులు



మంచిర్యాల విశ్వనాథస్వామి దేవస్థానం



దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

మంచిర్యాలఅర్బన్/దండేపల్లి: ముక్కోటి ఏకాదశి సందర్భంగా జిల్లాలోని ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు బారులు తీరారు. మంచిర్యాల విశ్వనాథ స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా వేంకటేశ్వర ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు శనివారం కనుల పండువగా నిర్వహించారు. గోవిందనామ స్మరణ మారుమోగింది. ఉత్తర ద్వారం వద్ద గరుడ వాహనంపై వేంకటేశ్వరుడిని పూలమాలలతో అలంకరించారు. ఉద యం ఐదు గంటల నుంచే ఉత్తర ద్వారం ద్వారా భక్తులు దర్శనం చేసుకున్నారు. వందలాది మంది గంటల తరబడి బారులు తీరి దర్శించుకున్నారు. పోలీసులు బందోబస్తు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ముక్తా రవి, అర్చకులు భట్టాచార్యులు, నరహరిశర్మ, బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు. దండేపల్లి మండలం గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో శనివారం వైకుంఠ ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉత్తర ద్వారం గుండా సత్యదేవుణ్ని దర్శించుకున్నారు. 136జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు. దీంతో ఆలయం వద్ద భక్తుల సందడి కనిపించింది.



దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ఆగుతూ.. సాగుతూ..!



గోదావరిలో వంతెన, పిల్లర్ల నిర్మాణానికి టెస్టింగ్ పనులు(ఫైల్)

- మంచిర్యాల–అంతర్గాం బ్రిడ్జి పనుల్లో జాప్యం
- మళ్లీ నిలిచిన గోదావరిపై వంతెన పనులు
- అందుబాటులోకి వస్తే రవాణా మెరుగు
- కొత్త ప్రభుత్వంలోనైనా త్వరగా పూర్తయ్యేనా..?

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లా ప్రజల చిరకాల వాంఛ గోదావరి నదిపై మంచిర్యాల–అంతర్గాం హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం పనులు ఒక అడుగు ముందుకు మరో అడుగు వెనక్కి అన్నట్లుగా సా..గుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు పనులు ప్రారంభించినప్పటికీ మళ్లీ ఆటకెక్కాయి. ప్రస్తుతం నదిలో నీటి ప్రవాహం లేకపోవడంతో ఇదే అనువైన సమయమని, పనులు వేగవంతం చేయాలని ప్రజలు కోరుతున్నారు. మరోవైపు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మొదలైన వంతెన పనులను కొత్త సర్కారు యథావిధిగా కొనసాగిస్తుందా..? లేక డిజైన్‌లో ఏమైనా మార్పులు చేస్తుందా..? అనేది స్పష్టత రావాల్సి ఉంది. ఒకవేళ పాత డిజైన్ ప్రకారమే పనులు చేపడితే టెండర్ దక్కించుకున్న నిర్మాణ సంస్థ పూర్తి చేయాల్సి ఉంది. ప్రధానంగా నిధుల విడుదల పనులపై ప్రభావం చూపనుంది. గత ప్రభుత్వంలో టెండర్లు మొదలు, నిర్మాణ పనులు జరిగే వరకు ఏళ్లుగా జాప్యం జరిగింది. కాంగ్రెస్ సర్కారు ఈ బ్రిడ్జి పనులను వేగవంతంగా పూర్తి చేస్తుందా..? లేదా..? అని ప్రజలు ఎదురు చూస్తున్నారు.



గోదావరిపై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణ ప్రాంతం

దూరం తగ్గి.. రవాణా మెరుగు

గోదావరి నదిపై ప్రస్తుతమున్న ఇందారం వద్ద వంతెనపై పెరిగిన ట్రాఫిక్ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతోంది. కరీంనగర్, హైదరాబాద్ రాకపోకలు సాగించాలంటే కచ్చితంగా రామగుండం, గోదావరిఖని వంతెన మీదుగానే ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో సమయం వృథాతోపాటు వంతెనపైనా ట్రాఫిక్ పెరిగి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోజు రోజుకు పెరుగుతున్న వాహనాల రద్దీ మేరకు మరో వంతెన నిర్మించాలనే డిమాండ్లు వచ్చాయి. ఈ మేరకు మంచిర్యాల పట్టణం గోదావరి రోడ్ మీదుగా పుష్కరఘాట్ నుంచి పెద్దపల్లి జిల్లా అంతర్గాం వైపు రెండు లేన్లతో కిలోమీటర్ల నిడివితో హైలెవల్ బ్రిడ్జి నిర్మించాల్సి ఉంది. ఈ వంతెన అందుబాటులోకి వస్తే పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల సమీప ప్రాంత వాసుల ప్రయాణం ఎంతగానో మెరుగు పడుతుంది. రామగుండం, మంచిర్యాల జిల్లాల మధ్య వ్యాపార, వాణిజ్య రంగాలకు మరింత ఊతమిస్తుంది.

ఐదేళ్లుగా..

2018 ఫిబ్రవరిలో జిల్లా పర్యటనలో అప్పటి సీఎం కేసీఆర్ హామీ మేరకు బ్రిడ్జి నిర్మాణానికి ఉన్నతాధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.125కోట్లు అవసరమని అంచనా వేశారు. ఈ మేరకు పరిపాలన అనుమతులు ఇచ్చేందుకు జీవో నంబరు 170 విడుదల చేశారు. ప్లాన్ ఫర్ వర్క్ పథకంలో నిధులు కూడా మంజూరు అయ్యాయి. టెండర్లు పిలవకపోవడంతో తీవ్ర జాప్యం జరిగింది. మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు హైకోర్టులో రిట్(మాండమస్) పిటిషన్ వేయడం, తర్వాత పనులు చేసేందుకు ప్రభుత్వం గత ఏడాది జూన్‌లో టెండర్లు పూర్తి చేసింది. బ్రిడ్జి నిర్మాణానికి నిధుల తక్కువ కావడంతో మొదట ఎవరూ ఆసక్తి చూపలేదు. చివరకు రూ.164కోట్లతో ‘వల్లభనేని’ నిర్మాణ సంస్థ పనులు దక్కించుకుంది. గత జూన్‌లో అప్పటి సీఎం కేసీఆర్ పనులు ప్రారంభించారు. తర్వాత అసెంబ్లీ ఎన్నికలకు ముందు పనులు మొదలయ్యాయి. నదిలో టెస్టింగ్ కోసం పలు చోట్ల పనులు సైతం చేపట్టారు. నేల స్వభావం, పిల్లర్లు, వంతెన బరువు, సామర్థ్యం తదితర వాటిపై పరిశీలనల కోసం పనులు సాగాయి. గత మూడు నెలలుగా మళ్లీ ఎలాంటి పనులు సాగడం లేదు. వంతెన నిర్మాణం పనులు పూర్తి చేసి ప్రజారవాణా మెరుగుపర్చాలని కోరుతున్నారు. గోదావరి వంతెన నిర్మాణంలో జరుగుతున్న ఆలస్యంపై జిల్లా రోడ్లు, భవనాల శాఖ ఈఈని సంప్రదించగా, టెస్టింగ్ నిర్మాణ పనులు చేశామని, త్వరలోనే మళ్లీ పనులు మొదలవుతాయని తెలిపారు.

మూడు నెలల్లో క్యాతనపల్లి ఆర్‌వోబీ పూర్తి చేస్తాం

- చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి
- ఫ్లై ఓవర్ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వివేక్

రామకృష్ణాపూర్: నత్తనడకన సాగుతున్న క్యాతనపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులు మూడు నెలల్లో పూర్తయ్యేలా చూస్తానని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి అన్నారు. శనివారం సాయంత్రం క్యాతనపల్లికి విచ్చేసిన ఎమ్మెల్యే ఆర్‌వోబీ పనులు పరిశీలించారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి కోసం నిధులు మంజూరయ్యాయని, ఇప్పటివరకు పూర్తికాకపోవడం బాధాకరమని అన్నారు. బ్రిడ్జి నిర్మాణం ఇంకా పూర్తికానందున ఇప్పటివరకు 20 మంది వరకు చనిపోయారని అన్నారు. మూడు నెలల్లో బ్రిడ్జి పనులు పూర్తయ్యేలా చూడాలని అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆర్‌కేపీ–మంచిర్యాల మార్గంలో ప్రయాణించే వేలాదిమందికి ఈ బ్రిడ్జి ఎంతో ఉపయోగకరమనేది గుర్తించి అటు నాణ్యత విషయంలోనూ ఎక్కడా రాజీపడొద్దని సూచించారు. పనుల ప్రోగ్రెస్‌ను తనకు రోజువారీగా మెసేజ్ చేయాలని పేర్కొన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జిల్లాలో 148 మందికి కరోనా పరీక్షలు

మంచిర్యాలటౌన్: జిల్లాలో కరోనా లక్షణాలతో ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చిన వారికి శనివారం ర్యాపిడ్ టెస్టులు నిర్వహించారు. కోవిడ్ లక్షణాలు ఉన్న వారు 148 మందికి కరోనా ర్యాపిడ్ టెస్టులు చేయగా, కోవిడ్ నిర్ధారణ కాలేదని జిల్లా కోవిడ్ నోడల్ అధికారి డాక్టర్ ఫయాజ్‌ఖాన్ తెలిపారు.

లక్ష్య సాధనకు సమష్టి కృషి



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న జీఎం సంజీవరెడ్డి



సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

- శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి
- ఘనంగా సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

నస్పూర్: ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశిత ఉత్పత్తి, ఉత్పాదక లక్ష్యాలు సాధించడానికి సమష్టిగా కృషి చేయాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి అన్నారు. శనివారం శ్రీరాంపూర్‌లోని ప్రగతి స్టేడియంలో సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జీఎం మాట్లాడుతూ రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశిత లక్ష్యాల్లో శ్రీరాంపూర్ ఏరియాలో ఇప్పటి వరకు 81శాతం సాధించామని అన్నారు. సింగరేణికి మరో వందేళ్ల భవిష్యత్ ఉందని, శ్రీరాంపూర్ ఏరియాలో మరో 20ఏళ్ల వరకు బొగ్గు ఉత్పత్తికి అవకాశం ఉందని తెలిపారు. సింగరేణి కేవలం బొగ్గు ఉత్పత్తి సాధించడమే కాకుండా సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి సారించి మంచి లాభాలు గడిస్తోందని చెప్పారు. సింగరేణి ఉద్యోగులు వివిధ క్రీడా విభాగాల్లో కోల్ ఇండియా స్థాయిలో బహుమతులు సాధించడం సంతోషకరమైన విషయమని అన్నారు. సింగరేణి భూ నిర్వాసితులను సైతం అన్ని విధాలుగా ఆదుకుంటున్నామని పేర్కొన్నారు. కారుణ్య నియామకాల ద్వారా యువకులకు సంస్థలో ఉద్యోగాలు కల్పిస్తున్నామని తెలిపారు. అంతకుముందు ఆయన జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్ చేశారు. స్టాల్స్‌ని ప్రారంభించి పరిశీలించారు. ఆవిర్భావ వేడుకల్లో పలు పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



ఉత్తమ ఉద్యోగిని సన్మానిస్తున్న జీఎం సంజీవరెడ్డి

ఉత్తమ ఉద్యోగులకు సన్మానం

శ్రీరాంపూర్ ఏరియాలో ఉత్తమ ఉద్యోగులుగా నిలిచిన డీవై ఎస్ఈ ఎస్ఆర్‌పీ 3, 3ఏ ఉప్పాల సాయి శ్రీనివాస్, ఆర్కే 6 అడిషనల్ మేనేజర్ కాదాసి శ్రీనివాస్, కోల్ కట్టర్ ఆర్కే 6 గుర్రాల రాంరెడ్డి, అసిస్టెంట్ ఫోర్‌మెన్ ఆర్కే 7 పూదరి ఉమేశ్ గౌడ్‌లకు జీఎం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీవైజీఎం పర్సనల్ అరవిందరావు, సేవా సమితి అధ్యక్షురాలు రాధాకుమారి తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు బంపర్ ఆఫర్

- పెండింగ్ చలాన్లపై భారీ డిస్కౌంట్
- ఈ నెల 26నుంచి జనవరి 10వరకు చెల్లింపునకు అవకాశం

మంచిర్యాలక్రైం: రాష్ట్ర ప్రభుత్వం వాహనదారులకు బంపర్ ఆఫర్ ప్రకటించింది. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన కింద విధించిన చలాన్ల చెల్లింపునకు భారీగా రాయితీ ప్రకటిస్తూ సంచలనాత్మక నిర్ణయం తీసుకుంది. వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్ల చెల్లింపునకు ఈ నెల 26నుంచి జనవరి 10వరకు అవకాశం కల్పించింది. గతంలో ప్రతీ ఏడాది హైదరాబాద్ వంటి మహానగరాల్లో ట్రాఫిక్ మెగా లోక్ అదాలత్ నిర్వహించి వాహనాలకు విధించి పెండింగ్ చలాన్లకు రాయితీ కల్పించేవారు. ఇది కాస్త 2016 అక్టోబర్ తర్వాత నిలిచిపోయింది. తిరిగి బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2022 మార్చి ఒకటి నుంచి 31వరకు రాయితీ కల్పించడంతో చాలామంది వాహనదారులు 80శాతం పెండింగ్ చలాన్లు చెల్లించారు. మళ్లీ ఆ తర్వాత ఈ–చలాన్లు విధిస్తుండగా.. పోలీసులు తనిఖీలు చేసిన సమయంలో ఎక్కువగా పెండింగ్ ఉంటే వసూలు చేస్తున్నారు. రూ.కోట్లలో చలాన్లు పేరుకుపోవడంతో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈసారి వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లపై 60శాతం నుంచి 90శాతం వరకు డిస్కౌంట్ ప్రకటించింది. ఆన్‌లైన్ ద్వారా గానీ, మీ సేవ కేంద్రాల్లో గానీ ఈ–చలాన్లు చెల్లించే అవకాశం ఉంది.

జిల్లాలో పెండింగ్ చలాన్లు

జిల్లాలో 2018 నుంచి 2023వరకు వివిధ రకాల వాహనాలు ట్రాఫిక్ ఉల్లంఘన కేసులు 6,17,938 నమోదు కాగా వీటికి గాను ఈ చలాన్ల ద్వారా రూ.24,56,03,200 జరిమానా విధించారు. ఇందులో 4,24,945 కేసులకు గాను రూ.17,74,36,770 వసూలు కాగా, 1,92,453 కేసులకు గాను రూ.6,81,66,430 పెండింగ్ ఉన్నాయి. వీటిలో చలాన్లు చెల్లించకుండా, ట్రాఫిక్ పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్న వారే ఉన్నారు. ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ వసూలు చేస్తున్నారు. ఈ క్రమంలో భారీ రాయితీతో ఇటు పోలీసులు అటు వాహనదారులకు ఊరట లభించింది. పూర్తి స్థాయిలో వసూలయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు. ఆన్‌లైన్‌లో చెల్లింపులు భారీ స్థాయిలో పెరిగి సర్వర్ డౌన్ అయ్యే ప్రమాదం ఉండడంతో 15రోజుల పాటు అవకాశం కల్పించారు. పరిస్థితిని బట్టి ఈ గడువు పొడగించే అవకాశం ఉంటుందని ఓ పోలీసు అధికారి తెలిపారు.

చిరు వ్యాపారులు, ఆర్టీసీ డ్రైవర్లకు..

పెండింగ్ చలాన్ల చెల్లింపు నేపథ్యంలో ఆయా వాహనాలపై గతంలో చార్జీషీట్లు దాఖలై ఉంటే వాటిని పోలీసులు ఉపసంహరించుకుంటారు. తోపుడు బండ్లపై వ్యాపారులు చేసే చిరు వ్యాపారుల ఉల్లంఘనలకు సంబంధించి కేసుడు నమోదు చేసే ట్రాఫిక్ పోలీసులు వారికి ఈ–చలాన్ జారీ చేస్తారు. ఆర్టీసీ బస్సులపై జారీ అయ్యే ఈ–చలాన్లను ఆ సమయంలో వాహనం నడిపే డ్రైవర్ చెల్లించాలి. ఈ రెండు కేటగిరీలకు చెందిన వారికి సైతం మెగా లోక్ అదాలత్‌లో అవకాశం ఇస్తున్నారు.

రాయితీ ఇలా..

ఆర్టీసీ డ్రైవర్లు, తోపుడుబండ్లకు 90శాతం, మోటార్‌సైకిళ్లు, ఆటోలకు 80శాతం, కార్లు ట్రక్కులు, లారీలకు 60శాతం రాయితీ కల్పించారు. వాహనాలపై చలాన్లు ఎన్ని ఉన్నాయో తెలుసుకోవడానికి https://echallan.ts police.gov.in/publicview సందర్శించవచ్చు. ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చు.

సద్వినియోగం చేసుకోవాలి



పెండింగ్ చలాన్లకు సంబంధించి భారీ డిస్కౌంట్‌పై అధికారికంగా ఎలాంటి ఆదేశాలు రాలేదు. వస్తే ఈ అవకాశాన్ని వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలి. వాహనదారులకు సువర్ణ అవకాశం. ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నివాణకు సహకరించాలి.

– నరేష్‌కుమార్, ట్రాఫిక్ సీఐ, మంచిర్యాల

కేసులు త్వరితగతిన పరిష్కరించాలి

బెల్లంపల్లి: పోలీస్‌స్టేషన్‌లో నమోదు అవుతున్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఏసీపీ పంతాటి సదయ్య అన్నారు. శనివారం బెల్లంపల్లి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. పోలీసు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్‌స్టేషన్‌లో నమోదు అవుతున్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా మెదలాలని, సిబ్బంది విధులను సక్రమంగా నిర్వర్తించాలని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. కేసుల దర్యాప్తులో ఆధునిక సాంకేతికతను వినియోగించి నైపుణ్యతను కనబర్చాలని తెలిపారు. దొంగతనాల నివారణ కోసం రాత్రి పటిష్టమైన పెట్రోలింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో బన్సీలాల్, ఎస్సై ప్రవీణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఏసీపీ సదయ్య

క్లుప్తంగా

విద్యార్థికి గాయాలు

దహెగాం: పాఠశాలలో ఆడుకుంటుండగా కిందపడడంతో విద్యార్థికి గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని లగ్గాం గ్రామానికి చెందిన దాగామా సాత్విక్ దహెగాంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం పాఠశాలకు వెళ్లి ఆడుకుంటుండగా కిందపడడంతో గాయాలయ్యాయి. పాఠశాల సిబ్బంది తల్లి దండ్రులకు సమాచారం అందించడంతో ముందుగా కాగజ్‌నగర్‌కు అక్కడి నుంచి మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. విద్యార్థికి చేయి విరిగిందని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

పంపుహౌజ్ సెక్యూరిటీ గార్డుల ధర్నా

కోటపల్లి(చెన్నూర్): దేవులవాడ ఎస్టీపీపీ పంపుహౌజ్‌లో మూడేళ్లుగా సెక్యురిటీ గార్డులుగా విధులు నిర్వహిస్తున్న తమను ఆదుకోవాలని శనివారం పంపుహౌజ్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేవులవాడ స్టేజ్ 1, 2, చెన్నూర్ పంపుహౌజ్ పనుల్లో భాగంగా పైపులైన్ కింద భూములు కోల్పోవడంతో పాటు రాత్రి పగలు కష్టపడి పంపుహౌజ్ ఆస్తులను కాపాడామన్నారు. ప్రస్తుతం పవర్‌ప్లాంట్ కంపెనీ తమను జైపూర్ పవర్‌ప్లాంట్‌లో పనిచేయమని వేధింపులకు గురిచేస్తోందని వాపోయారు. తమ కుటుంబాలు రోడ్డున పడకుండా సింగరేణి యజమాన్యం ఆదుకోవాలని వేడుకున్నారు. కార్యక్రమంలో మధుకర్, ప్రశాంత్, రాజమల్లు, సందీప్, శేఖర్, సుమంత్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు గురుకులం విద్యార్థి



ఎంపికైన సంతోశ్‌కుమార్

జైపూర్(చెన్నూర్): మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన వి.సంతోశ్‌కుమార్ ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన అత్యపత్య జూనియర్ మెన్ కేటగిరి ఎంపిక పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. ఈ నెల 25 నుంచి పుదుచేరిలో జరగనున్న పోటీల్లో విద్యార్థి పాల్గొననున్నట్లు అత్యపత్య జిల్లా అధ్యక్షుడు సుదర్శన్, ప్రధాన కార్యదర్శి శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావు, జేవీపీ కమలాకర్, పీఈటీ రాజలింగు విద్యార్థిని అభినందించారు.

కవితా పోటీలకు ఆహ్వానం

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రానికి చెందిన విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ టి.మల్లారెడ్డి 'నేటి విద్యార్థులే రేపటి నైతిక (ఆదర్శ) సమాజం' అనే అంశంపై కవితా పోటీలు నిర్వహిస్తున్నట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక సేవలో భాగంగా ఔత్సాహికులైన కవితా రచయితలు తమ కవితలను పోస్టుద్వారా, వాట్సాప్ ద్వారా పంపించాలని కోరారు. ఉత్తమ కవితలకు ప్రథమ బహుమతి రూ.2వేలు, ద్వితీయ బహుమతి రూ.1500, తృతీయ బహుమతి రూ.1000, కన్సోలేషన్ బహుమతులు రూ.500 ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పోటీలో పాల్గొనే కవులు తమ కవితలను టి.మల్లారెడ్డి, ఇంటినంబర్ 12-747/1, రెడ్డి కాలనీ, సంత్యసాయి టెంపుల్, మంచిర్యాల అడ్రస్‌కు లేదా 9948657937 వాట్సాప్ నంబర్‌కు జనవరి 31 లోగా పంపించాలని సూచించారు.

ఎన్నికల బిల్లులకు ఎదురుచూపు

- ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు రూ.5 వేల నుంచి రూ.7వేల వరకు ఖర్చు
- అడ్వాన్స్‌గా రూ.1500 చెల్లింపు



కోటపల్లి పోలింగ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన టెంట్ (ఫైల్)

చెన్నూర్: జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలు సజావుగా సాగేందుకు ఎన్నికల సంఘం పకడ్బందీ చర్యలు చేపట్టింది. జిల్లాలోని 743 పోలింగ్ స్టేషన్‌లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆర్వోల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల ఏర్పాట్ల కోసం నిధులు వచ్చినప్పటికీ ఖర్చుల కింద అడ్వాన్స్‌గా రూ.15 వందలు చెల్లించారు. కానీ ఒక్కో పోలింగ్ కేంద్రంలో ఎన్నికల ఏర్పాట్లకు రూ.5 నుంచి 7 వేల వరకు ఖర్చు అయ్యింది. మిగతా వాటిని కార్యదర్శులు సొంత ఖర్చులతో ఏర్పాట్లు చేశారు.

టెంట్లు, సిబ్బందికి భోజనం..

ప్రశాంత వాతావరణంలో ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఒక్కో పోలింగ్ స్టేషన్‌లో టెంట్‌తో పాటు తాగునీరు, టేబుళ్లు, కుర్చీలు, విద్యుత్ సౌకర్యం వంటి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఎన్నికల సిబ్బంది, పోలీసు సిబ్బందికి భోజన సౌకర్యం కల్పించారు. పోలింగ్ స్టేషన్లలో ఓటర్లతో పాటు ఎన్నికల సిబ్బందికి కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికలు సజావుగా జరిగాయి.

జిల్లాలో 810 పోలింగ్ స్టేషన్లు

జిల్లాలోని చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల నియోజకవర్గాలలో ఏడు మున్సిపాలిటీలు, 18 మండలాలు ఉన్నాయి. 18 మండలాల్లో 743 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. జిల్లాలోని గ్రామ పంచాయతీ పరిధిలోని పోలింగ్ స్టేషన్ల నిర్వహణ బాధ్యతలను కార్యదర్శులకు అప్పగించారు. పోలింగ్ స్టేషన్‌లో టెంట్లతో పాటు, ఇతర సామగ్రి, సిబ్బందికి భోజనాల కోసం ఒక్కో పంచాయతీ కార్యదర్శి రూ.5 నుంచి రూ.7 వేలు ఖర్చు చేశారు. ఎన్నికలు జరిగి 20 రోజులు కావస్తున్నా ఇప్పటికీ ఖర్చులు రాలేదు. దీంతో కార్యదర్శులకు ఎదురుచూపులు తప్పడంలేదు.

అడ్వాన్స్‌గా రూ.1500..

ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ స్టేషన్‌లో విధులు నిర్వహించే పోలింగ్, పోలీసు సిబ్బంది భోజనం కొరకు ఆర్వోలు రూ.1500 మాత్రమే అడ్వాన్స్‌గా చెల్లించారని కార్యదర్శులు పేర్కొన్నారు. టెంట్లు, కుర్చీలు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, టేబుల్స్, ఏర్పాట్లకు సంబంధించిన డబ్బులు ఇప్పటికీ ఇవ్వలేదని కార్యదర్శులు వాపోతున్నారు. మంచిర్యాల, చెన్నూర్ నియోజకవర్గాల్లోని ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు ఎన్నికల నిర్వహణ ఖర్చు కింద అడ్వాన్స్‌గా రూ.1500 అందించినా బెల్లంపల్లి నియోజకవర్గంలో మాత్రం చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదని పలువురు కార్యదర్శులు తెలిపారు.

జిల్లా ఎన్నికల అధికారికి నివేదిక..

చెన్నూర్ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 137 పోలింగ్ స్టేషన్లు, మూడు మున్సిపాలిటీలలో 90 పోలింగ్ స్టేషన్లు కలిపి మొత్తంగా 227 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు రూ.2 వేలు, చెన్నూర్ నియోజకవర్గంలోని ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు రూ.1500 చొప్పున ఇచ్చాం. ఇతర ఖర్చులు కూడా అయ్యాయని ఎంపీడీవోల ద్వారా నివేదికలు అందాయి. ఈ మేరకు కలెక్టర్‌కు నివేదించాం. నిధులు వచ్చిన వెంటనే ఇతర బిల్లులు చెల్లిస్తాం.

– సిడాం దత్తు, ఆర్వో, చెన్నూర్

'ఏఐటీయూసీని భారీ మెజార్టీతో గెలిపించాలి'



మాట్లాడుతున్న యూసుఫ్

మందమర్రిరూరల్(చెన్నూర్): కార్మిక హక్కులు కాపాడే ఏఐటీయూసీని ఈ నెల 27న జరగనున్న సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్ కోరారు. శనివారం ఏరియాలోని కేకే-5 గనిపై ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గతంలో గుర్తింపు సంఘంగా టీబీజీకేఎస్‌ను గెలిపిస్తే రాజకీయ జోక్యంతో సంస్థను దోచుకుందని ఆరోపించారు. ఐఎన్టీయూసీకి ఓటేస్తే టీబీజీకేఎస్ మాదిరిగానే ప్రభుత్వ సహకారంతో దోచుకుంటుందన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ ఏరియా సంయుక్త కార్యదర్శి కంది శ్రీనివాస్, బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు సుదర్శన్, రాజేశం, సంపత్, మనోహర్, సాంబయ్య పాల్గొన్నారు.

చరిత్రాత్మక హక్కులు సాధించాం



మాట్లాడుతున్న టీబీజీకేఎస్ నేతలు

శ్రీరాంపూర్: సింగరేణిలో గుర్తింపు సంఘంగా కార్మికులకు చరిత్రాత్మకమైన హక్కులు సాధించామని టీబీజీకేఎస్ కేంద్ర ఉపాధ్యక్షులు డీ.అన్నయ్య, మంద మల్లారెడ్డి, కేంద్ర చర్చల ప్రతినిధి ఏనుగు రవీందర్‌రెడ్డి, ఏరియా చర్చల ప్రతినిధి పెట్టం లక్ష్మణ్ అన్నారు. శనివారం నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సింగరేణి ఎన్నికల్లో తాము పోటీ చేస్తున్నామన్నారు. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ కార్మికుల ఏది కోరినా కాదనకుండా ఇప్పించారన్నారు. తాము సాధించిన హక్కులే తిరిగి ఎన్నికల్లో గెలిపిస్తాయన్నారు. ఈ ఎన్నికల్లో యువ కార్మికులు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా విజ్ఞతతో టీబీజీకేఎస్‌కు ఓటేసి గెలిపించాలన్నారు. ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ యూనియన్లు గెలిస్తే సింగరేణిలో మరింత ప్రైవేటీకరణ జరుగుతుందన్నారు. ఆ రెండు సంఘాల విధానాలు ఒక్కటేనన్నారు. సమావేశంలో ఆయా యూనియన్ నాయకులు బండి రమేశ్, జక్కుల రాజేశం, పానుగంటి సత్తయ్య, అశోక్, కరుణాకర్, గోపియా, మస్త్యాల రమేశ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై అనేక పోరాటాలు

- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్



యూనియన్‌లోకి ఆహ్వానిస్తున్న నేతలు

నస్పూర్: సింగరేణి కార్మికుల సమస్యలపై తాము ఎన్నో పోరాటాలు చేసి అనేక హక్కులు సాధించామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్ అన్నారు. శనివారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే న్యూటెక్, ఆర్కే 6 గనులపై జరిగిన గేట్ మీటింగ్‌లలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్యతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు యూనియన్‌లో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచి కార్యదర్శి బాజీసైదా, సంయుక్త కార్యదర్శి గౌ(రై నర్సయ్య, నాయకులు ప్రసాద్‌రెడ్డి, గునిగంటి నర్సింగరావు, లక్ష్మణ్, రమేశ్, సదానందం, రాజేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీలో యువకార్మికులకు ప్రాధాన్యత

- యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

రామకృష్ణాపూర్(చెన్నూర్): ఏఐటీయూసీలో యువ కార్మికులకు తగిన ప్రాధాన్యత కల్పిస్తామని యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. మందమర్రి ఏరియాలోని ఆర్‌కేపీ సీహెచ్‌పీపై శనివారం నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. క్యాడర్ స్కీంలు సరిగా అమలు చేసేలా, యువ కార్మికులకు కెరీర్ గ్రోత్ ఉండేలా చూస్తామన్నారు. స్వలాభం కోసం పాకులాడే సంఘాలను పక్కనబెట్టి కార్మికుల పక్షాన పోరాటాలు సాగించే ఏఐటీయూసీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయా సంఘాలకు చెందిన పలువురు కార్మికులు ఏఐటీయూసీలో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో యూనియన్ కేంద్ర కార్యదర్శి అక్బర్‌అలీ, ఆంజనేయులు, ఇప్పకాయల లింగయ్య, హరిరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'హెచ్‌ఎంఎస్‌కు ఒక్క అవకాశం ఇవ్వండి'

- యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్



మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

నస్పూర్: రాబోయే సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో హెచ్‌ఎంఎస్‌కు ఒక్క అవకాశం ఇవ్వాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ కోరారు. శనివారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్‌కే 5, ఆర్‌కే 6, ఏరియా వర్క్‌షాప్‌ల లో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లలో మాట్లాడారు. ఊసరవెల్లిలా రంగులు మార్చే టీబీజీకేఎస్, ఐఎన్టీయూసీ, సింగరేణి ప్రైవేటీకరణకు ఆజ్యం పోసిన ఏఐటీయూసీని ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి అనిల్‌రెడ్డి, నాయకులు అశోక్, లక్ష్మణ్, క్రాంతి, నవీన్, సదానందం, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకాలు

తాండూర్: ఈ నెల 20 నుంచి 22 వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన అండర్-14 రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో మండల విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. రేచిని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడోతరగతి చదువుతున్న ఎం.హర్షిత, కే.వెంకటేశ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి బంగారు పతకాలు సాధించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రదీప్, పీఈటీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్, ఇంగ్లిష్ విభాగంలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో కామర్స్ (ట్రాక్సషన్-1), ఇంగ్లిష్-1 ఆంగ్లమాధ్యమంలో బోధించేందుకు గెస్ట్ లెక్చరర్ ప్రాతిపదికన అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. సంబంధిత సబ్జెక్టులలో సెట్, పీహెచ్‌డీ అర్హత కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. పీజీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 28 సాయంత్రం నాలుగు గంటల్లోగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వినియోగదారుడా మేలుకో..

- నీ హక్కుల గురించి తెలుసుకో
- నేడు జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం



పాతమంచిర్యాల: తమ అవసరాల కోసం వస్తువులు లేదా సేవలను కొనుగోలు చేసే వారిని వినియోగదారులు అంటారు. వస్తువుల వినియమంలో వినియోదారునిదే ముఖ్యపాత్ర. వినియోగదారులు ఎలక్ట్రానిక్ విధానం, టెలీషాపింగ్, ఆన్‌లైన్ షాపింగ్, డైరెక్టు సెల్లింగ్, మల్టీలెవల్ మార్కెటింగ్ పద్ధతుల ద్వారా వస్తువులను పొందుతారు. తాము కొనుగోలు చేసిన తర్వాత ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించడానికి, పరిహారం పొందడానికి ప్రభుత్వం వినియోగదారులకు హక్కులు కల్పించింది. 1986 డిసెంబర్ 24న వినియోగదారుల రక్షణ చట్టం భారత దేశంలో అమలులోకి తెచ్చింది. నాటి నుంచి డిసెంబర్ 24ను ప్రభుత్వం జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవంగా నిర్వహిస్తోంది.

జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో కమిషన్

ప్రభుత్వం కల్పించిన హక్కుల ద్వారా తాము కొనుగోలు చేసిన వస్తు, సేవలలో నాణ్యత లోపిస్తే అమ్మకం చేసిన వస్తువులు, సేవా సంస్థల నుంచి నష్ట పరిహారం కోరే హక్కు వినియోగదారులకు ఉంటుంది. వస్తుసేవల గురించి పూర్తి సమాచారాన్ని పొందే హక్కు, సమస్యలకు పరిష్కారం కోరే హక్కు ఉంటుంది. వినియోగదారుల వివాదాల పరిష్కారం కోసం జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో కమిషన్‌లు ఉన్నాయి. న్యాయవాది అవసరం లేకుండానే కమిషన్‌లో కేసు వేయవచ్చు. రూ.5 లక్షల వరకు వస్తువు లేదా సేవలకు ఎలాంటి కోర్టు రుసుం ఉండదు. కేసు నమోదైన 120 రోజుల్లో తీర్పు వెలువరిస్తారు. జిల్లా కమిషన్ ఇచ్చే తీర్పుతో సంతృప్తి చెందకపోతే రాష్ట్ర కమిషన్‌లో ఫిర్యాదు చేయవచ్చు.

కొనుగోలుకు రశీదు తప్పనిసరి

వినియోగదారులు తాము కొనుగోలు చేసిన వస్తువులకు రశీదు తప్పనిసరిగా తీసుకోవాలి. నాణ్యత లోపిస్తే రశీదులు, ఇన్‌వాయిస్‌లు ఐడీల ద్వారానే వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు (కేసు) చేసే వీలుంటుంది. జిల్లాలో వినియోగదారుల కమిషన్ లేకపోవడంతో పాత ఉమ్మడి జిల్లా ఆదిలాబాద్‌లోని వినియోగదారుల కమిషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాల్సి వస్తోంది. జిల్లా కోర్టులో కమిషన్ ఏర్పాటు చేస్తే వినియోగదారులకు మేలు జరిగే అవకాశం ఉంది. కమిషన్‌కు వెళ్ల లేనివారు రిజిస్టర్ పోస్టు ద్వారా కూడా ఫిర్యాదులను జిల్లా వినియోగదారుల కమిషన్‌కు పంపుకోవచ్చు.

ఘనంగా సింగరేణి ఆవిర్భావ దినోత్సవం



నృత్యం చేస్తున్న చిన్నారులు



సింగరేణి జెండా ఆవిష్కరిస్తున్న జీఎం మనోహర్



జిల్లా కేంద్రంలో వేడుకల్లో పాల్గొన్న రిటైర్డ్ కార్మికులు

మందమర్రిరూరల్: సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని మందమర్రి ఏరియాలో శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యాలయ ఆవరణలో జీఎం మనోహర్ సింగరేణి జెండాను ఆవిష్కరించారు. అధికారులతో కలిసి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. జీఎం మాట్లాడుతూ సింగరేణి బొగ్గు ఉత్పత్తితో పాటు విద్యుత్ రంగంలో కూడా గణనీయమైన ప్రగతి సాధిస్తోందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏరియాలో 32 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి నిర్దేశిత లక్ష్యం కాగా ఇప్పటి వరకు 28 లక్షల టన్నులు సాధించామన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. అంతకుముందు మహిళలకు నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు జీఎం చేతులమీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్వో టూ జీఎం రాజేశ్వరరెడ్డి, పర్సనల్ మేనేజర్ సల్ల శ్యాంసుందర్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో..

మంచిర్యాలటౌన్: సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత కార్మికులు బి.కృష్ణ, పి.జగ్గారావు, బోనగిరి రాజిరెడ్డి, ఎం.సత్యనారాయణ, జి.నారాయణలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, కోశాధికారి పూదరి నర్సయ్య, విజ్ఞేష్, బి.రాజిరెడ్డి, గోనె తిరుపతి రావు, మహేందర్ రాజు, కే.రవీందర్‌రావు, రిక్కుల రాజిరెడ్డి, శ్రీనాథ్, మైసూర్ రాజు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న జడ్జి అసదుల్లా షరీఫ్

లక్సెట్టిపేట: ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులకు హాజరై మాట్లాడారు. పార్లమెంటు భారతీయ నాగరిక సురక్ష సన్హిత చట్టాన్ని ఆమోదించిందన్నారు. న్యాయవ్యవస్థలో చాల మార్పులు వస్తాయని, ప్రతిఒక్కరూ వాటి గురించి తెలుసుకోవాలన్నారు. న్యాయ వ్యవస్థలో వచ్చిన మార్పులు, చట్టాలను న్యాయవాదులకు వివరించారు. అనంతరం క్రైస్తవ సోదరులతో కలి సి సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు రాజేశ్వర్ రావు, బార్ అధ్యక్షులు కారుకూరి సురేందర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

'12న చలో పార్లమెంట్'

బెల్లంపల్లి: దేశంలోని అందరికీ ఉచిత విద్య, ఉపాధి కల్పన కోసం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జనవరి 12వ తేదీన చేపట్టిన చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్ అన్నారు. బెల్లంపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం చలో పార్లమెంట్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం 16 విద్యార్థి సంఘాలు చేపడుతున్న చలో పార్లమెంట్ కార్యక్రమంలో విద్యావేత్తలు, విద్యార్థులు, మేధావులు భారీగా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఖైరీలో భారీ అగ్ని ప్రమాదం

- విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో నాలుగిళ్లు దగ్ధం
- కాలి బూడిదైన పత్తి, బంగారం
- భారీ ఆస్తి నష్టం



కాలిన పత్తిని పరిశీలిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

కెరమెరి: మండలంలోని ఖైరీలో శనివారం విద్యుత్ మీటర్‌లో జరిగిన షార్ట్‌సర్క్యూట్‌తో గ్రామానికి చెందిన నాలుగిళ్లు దగ్ధమయ్యాయి. మొహర్లే గిర్మాజికి చెందిన 30 క్వింటాళ్ల పత్తి, రూ.లక్ష నగదు, తులం బంగారం, మొహర్లే చంద్రయ్యకు చెందిన 20 క్వింటాళ్ల పత్తి, రూ.20 వేల నగదు, తులం బంగారం, మొహర్లే సోమయ్య, కమలామాయికి చెందిన ఇంటి సామగ్రి, ఇల్లు కాలిపోయాయి. ఘటన సమయంలో కుటుంబ సభ్యులంతా వ్యవసాయ పనులకు వెళ్లడంతో ప్రాణనష్టం జరగలేదు. అప్పటికే గ్రామస్తులు నీళ్ల పోసి మంటలను అదుపులోకి తీసుకరాగా రెండు గంటన్నర తర్వాత ఫైరింజన్ వచ్చి మంటలను ఆర్పివేసింది. విషయం తెలుసుకున్న ఎంపీపీ పెందోర్ మోతిరాం, జెడ్పీటీసీ తుర్పతబాయి బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందించారు. అధికారులతో మాట్లాడి పరిహారం అందిస్తామన్నారు. వారి వెంట సర్పంచ్ విజయలక్ష్మి, న్యానేశ్వర్, నాయకులు బాలాజీ, సోము, శ్రీరాం, చందు, ధర్ము, సిరాజ్ ఉన్నారు.

విద్యార్థుల పొలం బాట

నెన్నెల: ఆహారం ఉత్పత్తికి రైతులు పడే కష్టం, శ్రమను ప్రత్యక్షంగా చూసేందుకు నార్వాయిపేట ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు శనివారం ఉపాధ్యాయులతో కలిసి పొలంబాట పట్టారు. తరగతి గదిలో పుస్తకాలతో కుస్తీపట్టి ఆ గదులకే పరిమితం కావడంతో వ్యవసాయ జీవనం, తమ ప్రాంతంలో పండే పంటలను విద్యార్థులకు వివరించడానికి క్షేత్రస్థాయి ప్రదర్శన నిర్వహించామని పాఠశాల హెచ్‌ఎం కోడూరి శ్రీనివాస్ తెలిపారు. వ్యవసాయంపై విద్యార్థి దశ నుంచే అవగాహన ఉండాలన్నారు. విద్యార్థులు పొలంలో స్వయంగా నాట్లు వేశారు. ఈ సందర్భంగా ఉత్తమ రైతు దంపతులను సన్మానించారు. ఉపాధ్యాయులు భీంపుత్ర, శ్రీనివాస్, సదయ్య, స్నేహలత, విద్యార్థులు పాల్గొన్నారు.



పొలంలో వరి నాటు వేసే పనిలో విద్యార్థులు